నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 5 జనవరి 2025 RANGAREDDY



మీర్‌పేటలో క్రీడా ప్రాంగణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితారెడ్డి

# నిధులు నిలిపివేసిన కాంగ్రెస్ సర్కార్

- బీఆర్ఎస్ హయాంలో పది చెరువుల సుందరీకరణ
- గుర్రపు డెక్కను కూడా తొలగించని కాంగ్రెస్ ప్రభుత్వం
- క్రీడా ప్రాంగణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట, జనవరి 4 : మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రణాళికబద్ధంగా చెరువులను అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్రపు డెక్కను కూడా తొలగించ లేకపోతున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా రెడ్డి ఆరోపించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు సమీపంలో రూ.1.80కోట్లతో క్రీడా ప్రాంగణానికి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను పరిశీలించారు. క్రీడా ప్రాంగణానికి సంబంధించి అధికారులు తయారుచేసిన మ్యాప్‌ను పరిశీలించారు. వాకింగ్ ట్రాక్, బ్యాడ్మింటన్ టెన్నిస్‌కోర్టు, చిల్డ్రన్ గేమ్‌కు సంబంధించిన వాటిని అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో పది చెరువులను కోట్లాది రూపాయలతో సుందరీకరణ చేశామన్నారు. గతంలో చెరువులను అభివృద్ధి చేయడానికి కేసీఆర్, కేటీఆర్ సహకారంతో కోట్లాది రూపాయలు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. చెరువుల్లో ఉన్న గుర్రపు డెక్కను తొలగించాలని ప్రభుత్వానికి రెండుసార్లు లేఖ రాశామని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అల్మాస్‌గూడలో చెరువు సుందరీకరణ పనులు మధ్యలోనే నిలిపివేశారన్నారు. ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో చాలా చోట్ల పనులు మధ్యలోనే ఆగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజక వర్గానికి వచ్చిన రూ. 279 కోట్లు వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై కోపంతో నిధులివ్వకపోతే ప్రజలు ఇబ్బంది పడుతారన్నారు. కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, కమిషనర్ పాల్గొన్నారు.

## సైక్లిస్ట్‌లకు హెల్మెట్ల పంపిణీ



సిటీబ్యూరో, జనవరి 4 ( నమస్తే తెలంగాణ ) : సైక్లింగ్‌ను ప్రోత్సహించడానికి హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ (హెచ్‌సీజీ) విభిన్న రకాల కార్యక్రమాలు చేపడుతుంది. సైకిళ్లను ఉచితంగా అందించడమే కాకుండా అందుకు సంబంధించి సైక్లిస్టులు ప్రమాదాల బారిన పడకుండా రక్షించే హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే వారికి ఇప్పటికే విడతల వారీగా సైకిళ్లను పంపిణీ చేసినట్టు ఫౌండర్ నందనూరి రవీందర్ తెలిపారు. తాజాగా మెదక్‌లోని సిద్దార్థ్ మోడల్ హైస్కూల్‌లో సుమారు 100 హెల్మెట్లను విద్యార్థులకు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. వీరితో పాటు సర్కార్ పాఠశాలల్లో విద్యనభ్యసించే నిరుపేదల పిల్లలకు కూడా సైకిళ్లను ఉచితంగా అందిస్తామని వివరాలు 9885440308 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు.



| నిషేధిత జాబితాలో ఉన్న భూములు.. | |
|---|---|
| గ్రామం పేరు | ఎకరాలు |
| మేడిపల్లి | 483 |
| నానక్‌నగర్ | 154 |
| తాటిపర్తి | 382 |
| కుర్మిద్ద | 974 |

# నిషేధం.. నిస్తేజం..?


భూములు అమ్ముకోనివ్వరు.. హామీలు నెరవేర్చరు.. రైతులను ఆగం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

రంగారెడ్డి, జనవవరి 4 (నమస్తేతెలంగాణ) : యాచారం మండలంలోని ఫార్మా అనుబంధ గ్రామాల్లో నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూముల తొలగింపుపై ఇంకా స్పష్టత రాలేదు. మండల పరిధిలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలు ఫార్మా పరిసర ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ గ్రామాల్లో ప్రభుత్వ అసైన్డ్ భూములను గతంలోనే ఫార్మాసిటీ కోసం స్వాధీనం చేసుకున్నారు. కాగా, పట్టా భూములు ఇవ్వడానికి అప్పట్లో రైతులు నిరాకరించారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల మధ్యలో పట్టా భూములుండడం వల్ల ఆ భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారు. పట్టా భూములను ఫార్మాకు ఇవ్వడానికి రైతులు నిరాకరించడంతో ప్రభుత్వం ఫార్మా అథారిటీ కింద వారి భూములకు పరిహారాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. కాని, రైతులు పరిహారం తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో తమ భూములు తమకివ్వాలంటూ ఎన్నో ఏండ్లుగా రైతులు ఆందోళన చేస్తున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిషేధిత జాబితా నుంచి తొలగించి వారికే పట్టాలిప్పిస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదు. మార్కెట్‌లో ఎకరా ధర రూ.కోటి ఉన్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం రూ.25లక్షలు ఇస్తామని ప్రకటించడంతో రైతులు ముందుకు రావడం లేదు. చాలీచాలని పరిహారం వద్దంటూ వారి భూములను వారే సాగు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితిలో పిల్లల పెండ్లిళ్లు, ఇతరత్రా ఖర్చులకు భూములు అమ్ముదామనుకునే రైతుల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. నిషేధిత జాబితాలో భూములు ఉండడం వల్ల రిజిస్ట్రేషన్లు కావడం లేదు. తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి న్యాయం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### ఎన్నికలప్పుడు హామీ.. అధికారం వచ్చాక దాటవేత..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములను తిరిగి వారికే అప్పగిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు వాగ్దానాలు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినప్పటికీ నిషేధిత భూముల ఎత్తివేతకు ఎవరూ ముందుకు రావడంలేదు. ఈ నేపథ్యంలో ఫార్మా వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ కొల సరస్వతి ఆధ్వర్యంలో రైతులు మరోమారు ఉద్యమానికి సిద్ధమాయ్యరు. గత వారం రోజుల నుంచి ఆయా గ్రామాల్లో ర్యాలీలు, సభలు నిర్వహించి తమ భూములను నిషేధిత జాబితాలో నుంచి తీసివేయాలని కోరుతున్నారు. జాబితా నుంచి తొలగించడం సాధ్యం కాదని, పరోక్షంగా కాంగ్రెస్ నాయకులు చెబుతుండడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.

గ్రామాల్లో నిషేధిత జాబితాలో సుమారు 800 నుంచి 1000 మంది వరకు రైతులు ఉన్నారు. ఎట్టి పరిస్థితిలో ఫార్మాకు ఇచ్చేది లేదని చెబుతూ.. సంబంధిత భూములను వారే సాగు చేసుకుంటున్నారు.




### నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలి..



నిషేధిత జాబితా నుంచి మా భూములను తీసివేయాలి. పట్టా భూములను బలవంతంగా ఫార్మా కోసం లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. భూమివ్వబోమని చెప్పినందుకు భూముల క్రయవిక్రయాలు జరుగకుండా అడ్డుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. భూములను లాక్కుంటే ఏం పని చేసి బతుకాలి.

– అంజయ్య, కుర్మిద్ద

### భూముల పేర్లు మార్చి అన్యాయం చేస్తుండ్రు..



ఆన్‌లైన్‌లో మా భూములు టీఎస్ఐఐసీ పేరు మీదకు మార్చారు. భూముల పేర్లు మార్చి తీవ్ర అన్యాయం చేస్తుండ్రు. నాకున్న మూడెకరాల భూమిని ఫార్మాసిటీ కోసం ఇవ్వమంటున్నారు. ఉన్న భూమి ఇచ్చి ఏం పనిచేసి బతుకాలో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలి. ఎన్నికలకు ముందు ఆ పార్టీ నాయకులు ఏం మాట్లాడారు.. ఇప్పుడెందుకు నోరు మెదుపడం లేదు.. సమాధానం చెప్పాలి. మా భూములు మాకే కావాలి.

– గడ్డం యాదయ్య, మేడిపల్లి

# పావురాలతో పందెం

ఇద్దరి అరెస్ట్, 250 పావురాలు స్వాధీనం



పరిగి, జనవరి 4 : సాధారణంగా గుర్రాల పందెం, సంక్రాంతికి కోళ్ల పందెం జరుగుతుంటుంది. కానీ పావురాలతో పందెం నిర్వహించేందుకు వచ్చిన వారిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించగా పరిగి పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం సమయంలో పరిగి లక్ష్మీనగర్‌లో ఓ ట్రాలీ ఆటోలో తీసుకువచ్చిన పావురాలను ఆకాశంలోకి వదులుతుండగా గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇక్కడ ఎవరో పావురాలు తీసుకువచ్చి వదులుతున్నారని తెలియజేయడంతో వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే సుమారు 30 పావురాలు ఎగిరిపోగా 250 పావురాలతో కూడిన బాక్సులను స్వాధీనం చేసుకొని పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా గోరుట్లకు చెందిన ప్రేమ్‌కుమార్ పావురాలకు శిక్షణ ఇస్తాడు. అనంతరం పావురాలతో పందెం నిర్వహిస్తుంటాడు. ఇందులో భాగంగా గోరుట్లకు సుమారు 200 కిలోమీటర్లు, 300 కిలోమీటర్ల దూరం పావురాలను బాక్సుల్లో తీసుకెళ్లి వదిలిపెట్టగా ముందుగా గోరుట్లకు చేరుకున్న పావురం గెలుపొందినట్లు ప్రకటిస్తారు. ప్రతి పావురానికి ఒక కోడ్ నెంబర్ ఇవ్వడంతోపాటు వాటి కాలుకు ట్యాగ్ చేస్తారు. గెలిచిన పావురంపై పందెం కట్టిన వారికి డబ్బులు ఇస్తారు. ఈ పావురాలతో పందెం తతంగం గత కొంతకాలంగా జరుగుతున్నట్లు తెలిసింది. పందెం కోసమే ఇక్కడికి తీసుకొచ్చి వదిలేందుకు వచ్చినట్లు పట్టుబడిన వారు పోలీసుల విచారణలో తెలిపారు. పావురాల పందెంతో ఈ ప్రాంతం వారికి ఎవరికైనా సంబంధాలు ఉన్నాయా లేదా అనేది పోలీసుల విచారణలో తేలనున్నది. ఇదిలావుండగా పావురాలతో పందెంకు సంబంధించి ప్రేమ్‌కుమార్, బాబాజాన్, మున్వర్‌లపై గేమింగ్ యాక్ట్, ప్రివెన్షన్ ఆఫ్ యానిమల్ క్రుయాలిటీ కింద కేసులు నమోదు చేసినట్లు దోమ ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన బాబాజాన్, మున్వర్‌లను రిమాండ్‌కు తరలించడం జరుగుతుందని ఎస్ఐ పేర్కొన్నారు.



పావురాలను తీసుకొచ్చిన వాహనం

# రుణాల రికవరీపై నజర్



జిల్లాలో రుణాలు పొంది తిరిగి చెల్లించని స్వయం సహాయక సంఘాలపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. మొండికేసిన స్వయం సహాయక సంఘాల నుంచి రుణాలను రికవరీ చేసేందుకుగాను సంబంధిత అధికారులు నడుం బిగించారు. రెండు, మూడు ఏండ్లుగా రుణాలను తిరిగి చెల్లించని సంఘాలను గుర్తించి వసూలు చేసేందుకు చర్యలు చేపట్టారు. అధికారులు సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ మార్పు రావడం లేదు. జిల్లావ్యాప్తంగా 13,138 స్వయం సహాయక సంఘాలు మొండికేయడంతో రూ.18.31 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. ఈ మొత్తాన్ని సంబంధిత సంఘాల నుంచి వసూలు చేసేందుకు నెలవారీగా టార్గెట్‌ను నిర్దేశించుకొని డీఆర్‌డీవో యంత్రాంగం చర్యలు చేపట్టింది. రుణాలను తిరిగి చెల్లించని సంఘాలకు రుణాలను మంజూరు చేయవద్దని బ్యాంకు అధికారులకు డీఆర్‌డీఏ యంత్రాంగం సమాచారమిచ్చింది. జిల్లావ్యాప్తంగా 13,138 స్వయం సహాయక సంఘాలుండగా, ఈ ఏడాది ఇప్పటివరకు రూ.394.27 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేశారు.

– వికారాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ)

- జిల్లాలో మొండికేసిన స్వయం సహాయక సంఘాలు
- పెండింగ్‌లో రూ.18.31 కోట్ల రుణాల రికవరీ
- జిల్లావ్యాప్తంగా పని చేయని సంఘాలు 1456
- రుణాల వసూలుకు ప్రత్యేక డ్రైవ్
- ఎస్‌హెచ్‌జీల్లో కదలిక తెచ్చేందుకు చర్యలు చేపట్టిన అధికారులు
- రుణాలు చెల్లిస్తేనే కొత్త రుణాలు మంజూరు చేసేలా చర్యలు
- ఈ ఏడాది ఇప్పటివరకు ఎస్‌హెచ్‌జీలకు రూ.394.27 కోట్లు
- జిల్లావ్యాప్తంగా 13,138 స్వయం సహాయక సంఘాలు



### పెండింగ్‌లో రూ.18.31 కోట్ల బకాయిలు..

జిల్లావ్యాప్తంగా రూ.18.31 కోట్ల రుణాలను సంఘాల నుంచి రికవరీ చేయాల్సి ఉన్నది. రికవరీతో పాటు సంఘాలను మరింత బలోపేతం చేసేందుకూ అధికారులు చర్యలు చేపట్టారు. పనిచేయని సంఘాల్లో కదలిక తీసుకొచ్చేందుకు కొత్తగా రుణాలను మంజూరు చేయబోమని హెచ్చరిస్తూ, బకాయిల వసూలుకు యత్నిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల పని తీరు...సంఘాలు సమావేశాలు నిర్వహిస్తున్నారా, ఎంత మంది సభ్యులు హాజరవుతున్నారు, సంబంధిత ఎస్‌హెచ్‌జీకి ఎంత అప్పు ఉన్నది, ఎంత డబ్బు పొదుపు చేశారనే విషయాలను సేకరిస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా యాలాల, పరిగి, దోమ, బంట్వారం, కోట్‌పల్లి, తాండూరు మండలాల్లో మొండికేసిన సంఘాలు అధికంగా ఉన్నాయి. యాలాల మండలంలో 166 సంఘాల నుంచి రూ.2.66 కోట్లు, పరిగి మండలంలో 110 సంఘాల నుంచి రూ.2.55 కోట్లు, దోమ మండలంలో 106 సంఘాల నుంచి రూ.1.70 కోట్లు, బంట్వారం మండలంలో 64 సంఘాల నుంచి రూ.1.56 కోట్లు, కోట్‌పల్లి మండలంలో 99 సంఘాల నుంచి రూ.1.56 కోట్లు, తాండూరు మండలంలో 127 సంఘాల నుంచి రూ.1.37 కోట్లు, మోమిన్‌పేట మండలంలో 75 సంఘాల నుంచి రూ.1.36 కోట్లు, పెద్దేముల్ మండలంలో 93 సంఘాల నుంచి రూ.92.67 లక్షలు, మర్పల్లి మండలంలో 74 సంఘాలు, ధారూరు మండలంలో 63 సంఘాలు రుణాల బకాయి ఉన్నాయి. బొంరాస్‌పేట మండలంలో 51 సంఘాల నుంచి రూ.37.64 లక్షలు, పూడూరు మండలంలో 60 సంఘాల నుంచి రూ.56.06 లక్షలు, వికారాబాద్ మండలంలో 37 సంఘాల నుంచి రూ.19.89 లక్షలు. కొడంగల్ మండలంలో 58 సంఘాల నుంచి రూ.35.01 లక్షల బకాయిలను వసూలు చేయాల్సి ఉన్నది.

# మద్యం విక్రయిస్తే రూ. 50 వేల జరిమానా

ఎన్నికల్లో మద్యం పంచితే రూ. 5 లక్షల జరిమానా

చించోడు గ్రామస్తుల తీర్మానం

షాద్‌నగర్, జనవరి4ః గ్రామంలో మద్యం అమ్మకాలను నిషేధించాలనే ఉద్దేశంతో ఫరూఖ్‌నగర్ మండలం చించోడు గ్రామంలో మద్య నిషేధంపై గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శనివారం గ్రామంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని అన్ని వర్గాల సూచనలు, సలహాలను సేకరించారు. గ్రామంలో మద్యాన్ని విక్రయిస్తే రూ. 50 వేల జరిమాన, మద్యం కొన్నవారికి రూ. 25 వేల ఫైన్ చెల్లించేలా నిబంధన విధించారు. ఎవరైనా మద్యం అమ్మినట్లు చూసి చెప్పినవారికి రూ. 10 వేల నగదు బహుమతి ఇస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామస్తుల నిర్ణయాన్ని వ్యతిరేకించే వారికి రూ. లక్ష జరిమానా విధించేలా తీర్మానం చేశామన్నారు. ఎన్నికల సమయాల్లో గ్రామంలో మద్యం పంచేవారికి రూ. 5 లక్షల జరిమానా విధిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. గ్రామంలో పేకాట ఆడినట్లు తెలిస్తే రూ. 50 వేల జరిమానా, పేకాట వివరాలను చెప్పినవారికి రూ. 25 వేల నగదు ప్రోత్సాహకం ఇస్తామని నిర్ణయించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఈ నిబంధనలు అమలులోకి వస్తాయని, ప్రతి ఒక్కరూ గమనించాలని తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు, అన్ని కులాల పెద్దలు పాల్గొన్నారు.




చించోడు గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధ తీర్మాన పత్రాలను చూపుతున్న గ్రామస్తులు